వావ్

- ఆహ్లాదకరంగా.. ఆకర్షణీయంగా ట్రిపుల్ ఆర్ సెంటర్లు
- వ్యర్థాల పునర్వినియోగంపై విస్తృత అవగాహన



వాల్‌పై గో గ్రీన్, సేవ్ ఎర్త్, సే నో టు ప్లాస్టిక్ నినాదం


జగదాంబ జంక్షన్‌కు సమీపంలో ఏర్పాటు చేసిన ట్రిపుల్ ఆర్ సెంటర్(ఉమెన్స్ రెస్టో కేఫ్)

డాబాగార్డెన్స్: జీవీఎంసీ ఏర్పాటు చేస్తున్న ట్రిపుల్ ఆర్ సెంటర్లను చూస్తే వావ్ అనాల్సిందే. వ్యర్థాల నిర్వహణకు అత్యంత కీలకమైన రెడ్యూస్, రీయూజ్, రీసైకిల్(ఆర్‌ఆర్‌ఆర్) పద్ధతిన ప్రోత్సహించేందుకు జీవీఎంసీ చేపడుతున్న కార్యక్రమాలు నగర ప్రజలను ఇట్టే ఆకట్టుకుంటున్నాయి. గ్రేటర్ విశాఖ పరిధి ఎనిమిది జోన్లలో ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ కేంద్రాలను ప్రారంభించారు. ట్రిపుల్ ఆర్ సెంటర్ తనదైన శైలిలో వినూత్న థీమ్స్‌తో అత్యాధునిక మౌలిక సదుపాయాలు కలిగి, వ్యర్థాలు, వాటి పునర్వినియోగంపై ప్రజల ఆలోచన ధోరణిలో మార్పు తేవడమే గాక జీవన విధానం, దైనందిక అలవాట్లలో ఓ కొత్త ఒరవడిని తీసుకొస్తోంది. ఇందులో భాగంగా జోన్‌–4 పరిధి జగదాంబ జంక్షన్‌కు కూతవేటు దూరంలో 'ఉమెన్స్ రెస్టో కేఫ్' సెంటర్‌ను ఆహ్లాదకర వాతావరణంలో ఏర్పాటు చేశారు. ఇక్కడ వివిధ వ్యర్థాలతో తయారు చేసిన వస్తువులను ప్రదర్శించారు. ఇవి సందర్శకులందరినీ ఆకర్షిస్తున్నాయి.

వ్యర్థాలతో కళాఖండాలు

మనం నిత్యం ఉపయోగించిన తర్వాత వ్యర్థాలుగా పారవేసే అనేక రకాలైన గాజు, కాగితం, మెటల్, ప్లాస్టిక్, టైర్లు, వస్త్రాలు, బ్యాటరీలు, ఎలక్ట్రానిక్ వస్తువులు, పాత దుస్తులు, చెప్పులు.. ఇలా ఒకటేంటి.. ఎన్నో రకాల వస్తువులు ఈ ట్రిపుల్ ఆర్ సెంటర్ల ద్వారా సేకరించి వాటిని పునర్వినియోగించేలా జీవీఎంసీ చర్యలు చేపడుతోంది. ఫలితంగా విశాఖ నగర సమగ్ర పర్యావరణ సమతుల్యతను కాపాడటంతోపాటు ఆర్థిక స్థిరత్వాన్ని కూడా సాధించేందుకు వీలుగా ఉంటుంది. పిల్లలకు పనికి వచ్చే ఆట వస్తువులతోపాటు వినియోగించుకో గలిగే అనేక వస్తువులు తయారు చేసుకోవచ్చు.

ట్రిపుల్ ఆర్ సెంటర్లతో ఎంతో ఉపయోగం



జీవీఎంసీ పరిధిలోని అన్ని జోన్లలో ట్రిపుల్ ఆర్ సెంటర్లు ఏర్పాటు చేశాం. వీటి ద్వారా ఎంతో ఉపయోగం ఉంది. వ్యర్థాల నిర్వహణకు, స్థిరమైన అభివృద్ధికి బాటలు వేస్తాయి. పర్యావరణాన్ని పరిరక్షించవచ్చు. వ్యర్థాల తక్కువ వినియోగం, పునర్వినియోగంపై ప్రజల్లో విస్తతంగా అవగాహన కల్పిస్తున్నాం. జోన్‌–4 పరిధి 31వ వార్డులో మహిళల కోసం ప్రత్యేకంగా.. ఆకర్షణీయంగా పాత వస్తువులు, టైర్లను ఉపయోగించి రెస్ట్ రూమ్, కాఫీ సెంటర్‌గా తీర్చిదిద్దాం.

– సాయికాంత్ వర్మ, జీవీఎంసీ కమిషనర్

క్లుప్తంగా

వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట


నేరెళ్లకోనేరు జంక్షన్‌లో పందిరి రాట వేస్తున్న అసోసియేషన్ సభ్యులు, స్థానికులు

అల్లిపురం: స్థానిక నేరెళ్లకోనేరు జంక్షన్‌లో రైజింగ్ గైస్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం వినాయక చవితి ఉత్సవాలకు పందిరి రాట కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ ప్రతినిధులు మాట్లాడుతూ సుమారు 60 ఏళ్లుగా గణపతి ఉత్సవాలు తమ ప్రాంతంలో ఆనవాయితీగా నిర్వహిస్తున్నామన్నారు. ఈ నెల 18 నుంచి 30 వరకు వినాయకుడికి విశేష పూజా కార్యక్రమాలు జరుగుతాయన్నారు. భక్తులు సహకరించాలని వారు కోరారు.

కోలుకున్న యువతి అప్పగింత


కొండమ్మను అమ్మమ్మకు అప్పగిస్తున్న ఏయూటీడీ ప్రతినిధి వాసు

అల్లిపురం: ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉన్న ఓ యువతికి వైద్య సాయం అందించి, కోలుకున్న అనంతరం ఆమె కుటుంబసభ్యులకు అప్పగించారు. వివరాలివి.. శ్రీకాకుళం జిల్లా, కోటబొమ్మాళి మండలం, లోకంది గ్రామానికి చెందిన బొత్తరా కొండమ్మ మే 31న ఫిట్స్‌తో రోడ్డుపై పడి ఉండటాన్ని మహారాణిపేట పోలీసులు గమనించారు. శరీరంపై గాయాలతో బాధపడుతున్న ఆమె సమాచారాన్ని టీఎస్‌ఆర్ కాంప్లెక్స్ లోని ఏయూటీడీ నిరాశ్రయ వసతి గృహానికి తెలియజేశారు. అక్కడ యువతికి చికిత్స అందజేయడంతో కోలుకుంది. కొండమ్మ నుంచి వివరాలు సేకరించి ఆమె అమ్మమ్మను షెల్టర్‌కు పిలిపించి అప్పగించినట్లు ఏయూటీడీ ప్రతినిధి వాసు తెలిపారు.

11న ఎస్సీ, ఎస్టీ అసోసియేషన్ మహాజన సభ

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం 11వ సర్వసభ్య సమావేశం ఈ నెల 11న నిర్వహించనున్నారు. ఆ రోజు సాయంత్రం 6 గంటలకు స్టీల్ క్లబ్ ఆడిటోరియంలో నిర్వహించనున్న సభలో 2022–23 ఆర్థిక సంవత్సర వార్షిక నివేదిక అందజేత, సంఘం సభ్యత్వాన్ని రూ. 20 నుంచి రూ. 30కు పెంచడం తదితర అంశాలను చర్చించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి బయ్యే మల్లయ్య తెలిపారు.

కాలుష్య నియంత్రణకు కృషి


సైకిల్‌పై కార్యాలయానికి వస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: కాలుష్య నియంత్రణ మనందరి బాధ్యత అని నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి పేర్కొన్నారు. కాలుష్య నియంత్రణలో భాగంగా మేయర్ సోమవారం తమ సొంత వాహనం వదలి క్యాంపు కార్యాలయం నుంచి విద్యుత్ వాహనంలో ప్రయాణించి జీవీఎంసీకి చేరుకున్నారు. జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ తన బంగ్లా నుంచి సైకిల్‌పై జీవీఎంసీకి వచ్చారు. అనంతరం జీవీఎంసీలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం(స్పందన) కార్యక్రమంలో వారిద్దరు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాలుష్య నియంత్రణకు అందరూ సహకరించాలని, సాధ్యమైనంత వరకు ప్రజా రవాణాను, విద్యుత్ వాహనాలను ఉపయోగించాలని కోరారు.

కనకమహాలక్ష్మికి వెండి పూజా సామగ్రి బహూకరణ


వెండి సామగ్రి బహూకరిస్తున్న నాగభూషణరావు కుటుంబ సభ్యులు

దాబాగార్డెన్స్: కనకమహాలక్ష్మి అమ్మవారికి విశాఖ నగరానికి చెందిన ఎ. నాగభూషణరావు వెండి పూజా సామగ్రిని బహూకరించారు. కేజీ 232 గ్రాముల 500 మిల్లీ గ్రాముల ఒక వెండి పళ్లెం, వెండి తీర్థపాత్ర, వెండి ఉద్ధరిణిని ఆలయ సహాయ కార్యనిర్వహణాధికారి కె. తిరుమలేశ్వరరావుకు అందజేశారు. వీరికి అమ్మవారి దర్శనం అనంతరం ప్రసాదం అందజేశారు. పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయానికి రూ.లక్ష విరాళం

కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి నర్సీపట్నానికి చెందిన సుంకర సత్యవతి రూ.లక్షా 116 విరాళం అందజేశారు. ఆలయంలో శాశ్వత అన్నదాన పథకం నిమిత్తం ఈ మొత్తాన్ని నగదు రూపంలో దేవాలయ సిబ్బందికి అందజేశారు. దాతకు అమ్మవారి దర్శనం, వేద ఆశీర్వచనం అనంతరం ప్రసాదం అందజేశారు.

8న శ్రావణలక్ష్మి ఉచిత పూజలు

- కనకమహాలక్ష్మి ఆలయంలో వరలక్ష్మీ వ్రతాలు

దాబాగార్డెన్స్: శ్రావణమాసం సందర్భంగా ఏటా కనకమహాలక్ష్మి దేవాలయంలో నిర్వహించే ఉచిత సామూహిక శ్రావణలక్ష్మి పూజలు (వరలక్ష్మీ వ్రతాలు) ఈ నెల 8న నిర్వహించనున్నట్లు ఆలయ కార్యనిర్వహణాధికారి కె శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం తెలిపారు. ఈ పూజల్లో పాల్గొనదలిచే మహిళలు ఈ నెల 7వ తేదీలోగా పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు ఆసక్తి గలవారు దేవస్థానం కార్యాలయంలో లభించే దరఖాస్తులను పూర్తి చేసి అందజేయాలని కోరారు. ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు కలశ చెంబు, ఆచమనం కోసం గ్లాసు తెచ్చుకోవాలని పేర్కొన్నారు.

సిరులతల్లికి అష్టదళ పద్మారాధన నేడు

దాబాగార్డెన్స్: బురుజుపేటలో కొలువైన కనకమహాలక్ష్మికి 108 స్వర్ణ పుష్పాలతో మంగళవారం అష్టదళ పద్మారాధన నిర్వహించనున్నారు. ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జరిగే ఈ ప్రత్యేక పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.1,116 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలి. భక్తులు యూనియన్ బ్యాంక్ అకౌంట్ నంబర్ 060810011006681 టౌన్ కొత్తరోడ్డు బ్రాంచ్, ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్0806081కు ఆన్‌లైన్ పేమెంట్ చేసి, పేరు, గోత్రం తెలిపితే వారి పేరిట పూజ చేస్తారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించవచ్చు.

19వ రోజుకు శ్రీలక్ష్మి పూజలు

కనకమహాలక్ష్మి ఆలయంలో శ్రావణమాసం సందర్భంగా నిర్వహిస్తున్న శ్రీలక్ష్మీ పూజలు సోమవారం నాటికి 19వ రోజుకు చేరాయి. ఉదయం 8 గంటలకు వేదమంత్రాలు, నాదస్వరాల నడుమ ప్రారంభమైన పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. పోస్టుల ద్వారా వచ్చిన భక్తుల పేరిట పూజలు చేసి కుంకుమ, అమ్మవారి యంత్రం, ప్రసాదం పంపారు. శ్రావణలక్ష్మీ పూజలో పాల్గొనదలచే భక్తులు రూ.400 చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని ఆలయ కార్యనిర్వహణాధికారి కె.శిరీష తెలిపారు. వివరాలకు 0891–2711725, 2566514 నంబర్లలో సంప్రదించాలని కోరారు. కార్యక్రమంలో ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, పలువురు ధర్మకర్తలు, ఆలయ ఏఈవో కె.తిరుమలేశ్వరరావు, పర్యవేక్షకుడు ముద్దాడ రమణ, ఆలయ సిబ్బంది, పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.

సికిల్‌సెల్ అనీమియా రోగికి రూ.10 వేల పింఛన్


రూపకు పింఛన్ అందజేస్తున్న శ్రీహరిరెడ్డి

అల్లిపురం: సికిల్‌సెల్ అనీమియాతో బాధపడుతున్న కుమ్మరవీధికి చెందిన మత్రి రూపకు రూ.10 వేలు పింఛన్ మంజూరైంది. రూప వ్యాధి గురించి, వారి కుటుంబ ఆర్థిక పరిస్థితి గురించి తెలుసుకున్న వార్డు వలంటీర్ ఝాన్సీ, ఆశ వర్కర్ పి.పార్వతి ఆమెతో పింఛన్‌కు దరఖాస్తు చేయించారు. సెప్టెంబర్‌లో ఆమెకు కొత్త పింఛన్ రూ.10వేలు మంజూరు చేశారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు, టెలికాం అడ్వయిజరీ కమిటీ సభ్యుడు పాల శ్రీహరిరెడ్డి, నీలాపు అయ్యప్పరెడ్డి చేతుల మీదుగా ఆమెకు కొత్త పింఛన్ అందజేశారు. ఈ ఆపద సమయంలో జగనన్న తనకు అండగా నిలిచారన్నారు. తనకు పింఛన్ వచ్చేందుకు సహకరించిన అందరికీ కృతజ్ఞతలు తెలిపారు.

పిల్లల్లో నైతిక విలువలు పెంపొందించాలి


దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణలను సత్కరిస్తున్న డిస్ట్రిక్ట్‌-101 గవర్నర్ శుభ, వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు

మురళీనగర్: పిల్లల్లో నైతిక విలువలు పెంపొందేలా తల్లిదండ్రులు బాధ్యత తీసుకోవాలని కవయిత్రి, సెయింట్ జోసెఫ్ వుమన్స్ కాలేజీ లెక్చరర్ దేవులపల్లి పద్మజ అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం మురళీనగర్ వనితా వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షురాలు విశ్వనాథ జయప్రభాశర్మ అధ్యక్షతన వైశాఖి మహిళా భవన్‌లో ఉత్తమ ఉపాధ్యాయుల సత్కార సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆమె మాట్లాడుతూ నేటి బాలబాలికలను పెద్దల పట్ల గౌరవ భావాలు ప్రకటించేలా పెంచాలని సూచించారు. ప్రతి ఇంట్లో మాతృభాషలో మాట్లాడాలని, తెలుగు గొప్పదనాన్ని పిల్లలకు చెప్పాలన్నారు. రిటైర్డ్ ఉపాధ్యాయుడు వెన్నెల సూర్యనారాయణ మాట్లాడుతూ పిల్లల్లో మానసిక పరిపక్వతకు ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు సహకరించాలన్నారు. జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ గ్రహీత, రాంపురం బాలికల జూనియర్ కళాశాల ఇంగ్లిష్ లెక్చరర్(పీజీటీ) కశిరెడ్డి వెంకటరావు మాట్లాడుతూ విద్యార్థులకు దేశ సంస్కృతీ సంప్రదాయాల ప్రాధాన్యాన్ని తెలియజేయాలన్నారు. తెలుగుతోపాటు ఇంగ్లిష్‌లో ప్రావీణ్యం వల్ల ఉద్యోగావకాశాలు మెరుగుపడతాయని చెప్పారు. ఉన్నత విలువలు కలిగిన పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులతోపాటు తల్లిదండ్రులు బాధ్యత వహించాలన్నారు. ఈ సందర్భంగా దేవులపల్లి పద్మజ, కశిరెడ్డి వెంకటరావు, వెన్నెల సూర్యానారాయణ మాస్టార్లను వాకర్స్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్‌–101 గవర్నర్ ఉప్పలపాటి శుభ చేతుల మీదుగా వనితా వాకర్స్ క్లబ్ సభ్యులు ఘనంగా సత్కరించి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులను అందజేశారు. అనంతరం క్లబ్ కార్యవర్గ సమావేశం నిర్వహించి ఈ నెలలో పుట్టిన రోజు వేడుకలు జరుపుకుంటున్న సభ్యులకు చిరు కానుకలు అందించారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి ఎస్.రోజారాణి, కోశాధికారి జి.షీలారాణి, పూర్వ అధ్యక్ష, కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కేజీహెచ్ నుంచి వ్యక్తి అదృశ్యం


అదృశ్యమైన శశిభూషణ్ నాయక్

దాబాగార్డెన్స్: కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్న ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం బిలయ్‌గ్రహ్ జిల్లాకు చెందిన శశిభూషణ్ నాయక్ అనే వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ మేరకు వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసులు తెలిపిన వివరాలివి... మతిస్థిమితం కోల్పోయి చికిత్స పొందుతున్న నాయక్ గత నెల 31వ తేదీ సాయంత్రం 6.30 గంటల సమయంలో కేజీహెచ్ న్యూరో వార్డు నుంచి అదృశ్యమయ్యాడు. ఆచూకీ తెలిసిన వారు 9440796019, 9440796028 అనే ఫోన్ నంబర్లకు సమాచారం ఇవ్వాలని పోలీసులు కోరారు.

అప్పన్నకు వైభవంగా ఆర్జిత సేవలు


మాంగల్యధారణ ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి సోమవారం ఆర్జిత సేవలు విశేషంగా జరిగాయి. ఉదయం 9.30 గంటల నుంచి నిత్యకల్యాణం ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్టంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణ ధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ,తలంబ్రాలు ఘట్టాలతో కల్యాణం నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాలు అందజేశారు. అర్చకులు పెద్దరాజు, శ్రీకాంత్ తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

ఘనంగా గరుడ సేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి గరుడసేవ వైభవంగా జరిగింది. కల్యాణ మండపంలోని వెండి గరుడ వాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్టంపజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

ఎమ్మెల్యే వాసుపల్లి వితరణ

- ఐదుగురికి రూ.25 వేల ఆర్థిక సాయం


మణికంఠను పరామర్శించి, నగదు అందిస్తున్న ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్

అల్లిపురం: వైఎస్సార్‌సీపీ కార్యకర్తల కుటుంబాలకు ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ అండగా నిలిచారు. ప్రజాదర్బార్‌లో వచ్చిన వినతుల మేరకు సోమవారం ఐదుగురికి రూ.25వేలు ఆర్థిక సహకారం అందజేశారు. 32వ వార్డు కర్ణాలవీధికి చెందిన కొత్తపు ధర్మతేజ కిడ్నీ సమస్యతో బాధపడుతున్నాడు. అతడి మందుల కోసం ఆర్థిక సాయం కోరడంతో వారి ఇంటికి వెళ్లి పరామర్శించి, రూ.5 వేలు అందించారు. అదే వీధిలో పకోడి సందు ప్రాంతానికి చెందిన 12 సంవత్సరాల మణికంఠ రెండు కాళ్లు చచ్చుబడి, కదల్లేని స్థితిలో ఉండటంతో, ఫిజియోథెరపీ కోసం సాయం కోరగా రూ.5వేలు అందించారు. 38వ వార్డు చిన్నమ్మ వారి వీధిలో నివసించే వాసుపల్లి రామారావు అనే డయాబెటిక్ రోగికి మందుల నిమిత్తం రూ.5 వేలు అందజేశారు. ఎమ్మెల్యే వెంట 35వ వార్డు కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు, 32వ వార్డు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు మూలే రామిరెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు లింగం శ్రీనివాసరావు, బోణి దేవ, బంగారమ్మ, కృష్ణవేణి, 38వ వార్డు నాయకులు సారిపిల్లి అరుణ, టేకి ప్రసాద్, కడియం ప్రసాద్, వల్లి శ్రీనివాసరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

త్వరితగతిన వినతుల పరిష్కారం


అర్జీదారు సమస్యలు తెలుసుకుంటున్న జోన్‌-5 కమిషనర్ కృష్ణ

కంచరపాలెం: జ్ఞానాపురంలోని జీవీఎంసీ జోన్‌–5 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 6 వినతులు అందాయి. అర్జీదారుల వద్ద నుంచి వాటిని జోనల్ కమిషనర్ ఆర్.జి.వి.కృష్ణ స్వీకరించి ఆయా విభాగాల అధికారులకు అందజేశారు. టౌన్ ప్లానింగ్‌కు 3, యూసీడీకి 1, రెవెన్యూకు 01, పబ్లిక్ హెల్త్ విభాగానికి 1 చొప్పున అర్జీలు అందినట్లు జెడ్సీ తెలిపారు. ప్రజా వినతులను త్వరితగతిన పరిష్కరించాలని ఆదేశించారు.

జెడ్సీతో ట్రాఫిక్ సీఐ చర్చ

జెడ్సీ కృష్ణతో కంచరపాలెం ఐదో పట్టణ ట్రాఫిక్ సీఐ మళ్ల అప్పారావు సమావేశమయ్యారు. జోన్‌–5 పరిధిలోని రహదారులపై ట్రాఫిక్ రూల్స్‌కు సంబంధించి ఏర్పాటు చేస్తున్న జీబ్రా క్రాసింగ్ లైన్లు, స్పీడ్ బ్రేకర్లు, ఫుట్‌పాత్‌లకు రంగులు తదితర అభివృద్ధి పనులపై చర్చించారు. ఇంజినీరింగ్, టౌన్ ప్లానింగ్ అధికారులు సహకారం అందించాలని ఆయనను సీఐ కోరారు. కార్యక్రమంలో జోన్ సూపరింటెండెంట్‌–1 టి.ఎస్.ఎన్.రాజు, సూపరింటెండెంట్‌–2 ఆర్.వి.రాజు, రెవెన్యూ ఆఫీసర్లు బాబూరావు, రాజ్యలక్ష్మి, ఇంజినీరింగ్ ఈఈ శ్రీనివాసరావు, టి.ప్రసన్నరెడ్డి, పబ్లిక్ హెల్త్ ఏఎంహెచ్‌వో డాక్టర్ ఎ.సునీల్‌కుమార్, టీపీఆర్‌వో ఏపీడీలు పద్మావతి, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ పాలనలో ప్రభుత్వరంగ సంస్థలు నిర్వీర్యం


జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద దీక్షలో ఏఐటీయూసీ నాయకులు

సీతమ్మధార: ప్రభుత్వరంగ సంస్థలను బీజేపీ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోందని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎం.మన్మథరావు ఆరోపించారు. విశాఖ ఉక్కు – ఆంధ్రుల హక్కు నినాదంతో, మహనీయుల ప్రాణ త్యాగాలతో సాధించుకున్న స్టీల్‌ప్లాంట్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటుపరం కానివ్వబోమన్నారు. స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షల్లో సోమవారం ఏఐటీయూసీ, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, ఆంధ్రప్రదేశ్ మహిళా సమాఖ్య, దళిత హక్కుల పోరాట కమిటీ సభ్యులు పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ నరేంద్రమోదీ అధికారంలో వచ్చిన తర్వాత తొమ్మిదేళ్లలో అన్ని రంగాల్లో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. స్టీల్‌ప్లాంట్‌ను కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తే ఇప్పుడున్న ఉద్యోగాలు పోవడంతో పాటు భావితరాలకు ఉపాధి ఉండదన్నారు. కార్మికులు, ఉద్యోగులు ఐక్య పోరాటాలతో ప్లాంట్‌ను పరిరక్షించుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో డి.కిరణ్, బి.ప్రకాష్, ఎ.జనార్దన్, ఎస్.మధురెడ్డి, కె.రమణ, వనజాక్షి, దేవుడమ్మ, జి.జయ, ఎన్.శ్రీను, యు.నాగరాజు, కె.అచ్యుత్‌రావు, ఎంఎ బేగం, జి.రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

వేగవంతంగా పార్కుల ఆధునికీకరణ


శివాజీ పార్కులో ఫౌంటైన్ పనులు పరిశీలిస్తున్న జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ

దాబాగార్డెన్స్: నగరంలో చేపడుతున్న పార్కుల ఆధునికీకరణ పనులు త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవాలని జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ సంబంధిత ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా సోమవారం జోన్‌–3 పరిధిలో శివాజీ పార్కు తదితర పార్కుల ఆధునికీకరణ పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ శివాజీ పార్కులో చేపడుతున్న ఆధునికీకరణ పనుల్లో వాటర్ ఫౌంటైన్, పెయింటింగ్, లైటింగ్, పచ్చదనం పెంపొందించడం, సందర్శకులు కూర్చునే బల్లల ఏర్పాటు, తాగునీరు, మరుగుదొడ్లు, క్యాంటీన్ వంటి పనులు ఈ నెలాఖరు నాటికి పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులు, కాంట్రాక్టర్‌ను ఆదేశించారు. పార్కులో పారిశుద్ధ్యం సరిగ్గా నిర్వహించడం లేదని, తాగునీరు, వాకింగ్ ట్రాక్ సరిగ్గా లేవని వాకర్స్ అసోసియేషన్ సభ్యులు కమిషనర్ దృష్టికి తీసుకురాగా, ఆధునీకరణ పనులు చేపడతున్నామని, పూర్తయిన వెంటనే అన్ని సమస్యలు పరిష్కరిస్తామని బదులిచ్చారు.ఈ పర్యటనలో పర్యవేక్షక ఇంజినీరు శ్యాంసన్ రాజు, జోనల్ కమిషనర్ విజయలక్ష్మి, కార్యనిర్వాహక ఇంజినీరు శ్రీనివాసరావు, డీఈ, ఏఈ సంబంధిత కాంట్రాక్టర్లు పాల్గొన్నారు.

నైపుణ్యం గల మానవ వనరులతో ఆక్వారంగం అభివృద్ధి


కోర్సు మెటీరియల్‌ను ఆవిష్కరిస్తున్న ఏయూ రిజిస్ట్రార్ కృష్ణమోహన్

ఏయూక్యాంపస్: నైపుణ్యం గల మానవ వనరులను సుసంపన్నం చేయడం వల్ల ఆక్వారంగం మరింత అభివృద్ధి సాధిస్తుందని ఆంధ్రా యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.కృష్ణమోహన్ అన్నారు. ఏయూ–అవంతి ఆక్వా కల్చర్ స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్ ఆధ్వర్యంలో సోమవారం 'రొయ్యల పెంపకంలో మెరుగైన యాజమాన్య విధానాలు' అనే అంశంపై నిర్వహిస్తున్న 30 రోజుల నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ శరవేగంగా అభివృద్ధి సాధిస్తున్న రంగాల్లో ఆక్వా ఒకటిగా నిలుస్తూ దేశానికి విదేశీ మారకాన్ని ఆర్జిస్తోందన్నారు. అదే సమయంలో ఈ రంగాన్ని అనేక సవాళ్లు ఎదురవుతున్నాయని, నాణ్యతను నిలుపుకోవడం, విత్తనం నుంచి పెంపకం వరకు, ఆహారం వంటివి ఎంతో జాగ్రత్తలతో నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. మెరైన్ లివింగ్ రిసోర్సెస్ విభాగాధిపతి ఆచార్య పి.జానకీరాం మాట్లాడుతూ ఏయూతో అవంతి ఫౌండేషన్ చేసుకున్న ఎంవోయూలో భాగంగా ప్రపంచ స్థాయి మౌలిక వసతులను కల్పించి మంచి శిక్షణ కేంద్రంగా తీర్చిదిద్దనున్నట్టు తెలిపారు. ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ డైరెక్టర్ డాక్టర్ ఎ.కె.రెడ్డి మాట్లాడుతూ అవంతి ఫౌండేషన్ మేనేజింగ్ ట్రస్టీ అల్లూరి ఇంద్రకుమార్ ఆలోచనలకు ప్రతిరూపంగా నైపుణ్య శిక్షణ కేంద్రం నిలుస్తుందన్నారు. ఏయూ–అవంతి ఏఎస్‌డీసీ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ కె.ఫణి ప్రకాష్ మాట్లాడుతూ ఈ కేంద్రం నుంచి 16వ నైపుణ్య శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు తెలిపారు. 20 మంది బీఎఫ్‌ఎస్సీ, ఎంఎస్సీ, బీఎస్సీ విద్యార్హత కలిగిన వారు తమిళనాడు, పశ్చిమబెంగాల్, గుజరాత్, ఏపీ నుంచి శిక్షణకు హాజరవుతున్నట్టు చెప్పారు. 13 రోజులు థియరీ, 17 రోజుల పాటు ప్రాక్టికల్ శిక్షణ అందించనున్నట్టు తెలిపారు. కోర్సు మెటీరియల్‌ను రిజిస్ట్రార్ ఆవిష్కరించారు. ఆచార్య కె.రమేష్ బాబు, డాక్టర్ రామచంద్ర గణేష్, డాక్టర్ డి.సునీల్ కుమార్, సీహెచ్ బ్రహ్మారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సకాలంలో ఓటర్ల సర్వే పూర్తి చేయాలి


ఓటర్లతో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ఆరిలోవ: ఇంటింటి ఓటర్ సర్వేను సకాలంలో పూర్తి చేయాలని బీఎల్‌వోలను కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున ఆదేశించారు. జీవీఎంసీ పదో వార్డులోని 67, 68 పోలింగ్ కేంద్రాలను సోమవారం జేసీ కె.ఎస్.విశ్వనాథన్‌తో కలసి ఆయన సందర్శించారు. ఆయా కేంద్రాల పరిధిలో జరుగుతున్న ఇంటింటి ఓటరు సర్వేను పరిశీలించారు. ఓటర్లతో కలెక్టర్ నేరుగా మాట్లాడి ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకోవాలని సూచించారు. సర్వే జరుపుతున్న బీఎల్‌వోలకు సహకరించాలని కోరారు. అనంతరం ఆయన బీఎల్‌వోలకు పలు సూచనలు చేశారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరినీ ఓటరుగా నమోదు చేయాలన్నారు. ఓటర్ల నుంచి సేకరించిన వివరాలను పూర్తి సమాచారంతో రిజిస్ట్రేషన్ ద్వారా రికార్డుల్లో నమోదు చేయాలని చెప్పారు. ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్డీసీ మోహన్‌రావు, రూరల్ తహసీల్దారు ఎస్.రమణయ్య పాల్గొన్నారు.

కస్తూరినగర్‌లో చోరీ

- 3 తులాల బంగారం, 18 తులాల వెండి అపహరణ

తాటిచెట్లపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ ఇంట్లో చోరీ జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. కంచరపాలెం కస్తూరినగర్‌–1లో కె.లక్ష్మి అనే మహిళ తన కుమారుడితో కలిసి నివసిస్తోంది. ఈ నెల 2న ఎన్‌జీజీవోస్ కాలనీలోని తన కుమార్తె ఇంటికి ఈమె వెళ్లింది. తన కుమారుడు ఆదివారం రాత్రి తన స్నేహితుడి ఇంటికి వెళ్లాడు. సోమవారం ఉదయం ఇంటికి వచ్చి చూసేసరికి ఇంటి తాళం తీసి బీరువాలోని సుమారు 3 తులాల బంగారం, 18 తులాల వెండి అపహరణకు గురైనట్లు గుర్తించి వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేశారు. కంచరపాలెం సీఐ ఎస్.సాయి నేతృత్వంలో క్రైం ఎస్ఐ సునీల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.